కథానిక

# మానవి గాయం

"రమణశ్రీ"

నిశీథంగావున్న ఆ వాతావరణంలో వెంకటరత్నం పూరిపాకలో మాత్రం కొత్త అలజడిగా వున్నట్టు కనిపిస్తోంది. నలుదిశల్లో కమ్ముకొని పొంగి పోతోన్న చీకటి పొగల్లో తనకి కూడా తను కనిపించటంలేదు!

అక్కడక్కడ మసకమసగ్గావున్న వెలుగు నీడలు ఆడుగూ, ఆడుగున్నర మేర జరిగి పోతూవున్నాయి. వెల్లకితలా పడుకున్న వెంకటరత్నానికి యెలా మెళుకువ వచ్చిందో గాని, ఎందుకొచ్చిందో గాని కూడా అర్థంగాలేదు! ఎవరన్నా తనని పిలిచారా?—అనుకున్నాడు. అలా అనుకున్నందుకు అంత నిద్ర మత్తు మెళుకువలోనూ కూడా నవ్వొచ్చింది. తన్నెవరు పిలుస్తారు? తనెవరిక్కావాలి? తనకీ తన భార్యా బిడ్డలకూ తప్ప—తనేమన్నా కలెక్టరా? గవర్నరా? ఆఫీసు ఉద్యోగా? ఆఖరికి బంట్రోతు కూడా కాదే!

అసలు తనపేరే తెలీదు కొందరికి—

ఎవరో మళ్ళీ పిలిచారు! ఈసారి కంఠం ఆనవాలు పట్టగలిగాడు. "ఎందుకూ?" అన్నాడు. కమలం రెక్క తలుపులు తోసుకుంటూ ఇవతలి కొచ్చింది. "ఏం నాన్నా! ఎంతసేపు పిలిచినా పలకవేం? మంత్రసానిని తీసుకురావాలి నాన్నా—పిన్నికి నొప్పులు—ఒకటే బాధ పడుతోంది అరగంటనుంచీ—"

"నిజమే!" అన్నాడు అప్రయత్నంగా.

కమలం తెల్లబోతూ "అబద్ధ మాడతానా నాన్నా; త్వరగా బయల్దేరు" అంది.

"అలమారలో బ్యాటరీలైటు వుంటుంది తీసుకురా" అన్నాడు వెంకటరత్నం.

"అందులో బ్యాటరీ అయిపోయి ఆరునెల్లు అయింది నాన్నా" అంది కమలం నవ్వుతూ. ఆ నవ్వు వెంకటరత్నం మునిగుండెల్లో పోటు పెట్టింది. లక్ష్మి తన దరిద్రాన్ని చూసి వెక్కిరిస్తోన్నట్టుంది ఆ నవ్వు. ఆ నవ్వు తన పౌరుషాభిమానాల్ని అపహాస్యం చేస్తోన్నట్టుంది.

హరికేన్ లాంతర్లో కిరసనాయిలుండదు. అడగక్కరలేదు. ఎంత దరిద్రం! మాసినలుంగీ పంచ గూడకట్టుకడుతూ "రుమాలు లేదూ?" అన్నాడు.

"పిన్ని పక్కమీద వేశాం" అంది కమలం.

"నువ్వెళ్ళు. మీఅమ్మా నువ్వూ జాగ్రత్తగా కనిపెట్టుకు వుండండి, నేను మంత్రసానిని పిలుచుకొస్తా."

"ఎరికిలమ్మనట తీసుకరమ్మంది అమ్మ" అని కమలం లోపలికి జారుకుంది.

పక్కమీద దుప్పటి తీసుకుని, మెడకు చుట్టుకుని బయల్దేరాడు. ఆ నిశ్శబ్ద భీభత్స కాళరాత్రిలో ఏం జరుగుతుందో కూడా ఎవరికీ తెలీదు. ఒక చిన్న పిట్టకూత కూడా వినిపించటంలేదు, వెంకటరత్నం భార్య మూల్గే మూల్గులు తప్ప.

వెంకటరత్నం భార్యకప్పుడే ఇది నాలుగో కాన్పు. అయిదు సంవత్సరాలయింది కాపురానికి వచ్చి. అప్పుడే నలుగురు పిల్లల తల్లి కాబోతోంది. పుట్టబోయే శిశువెవరో మనకింకా తెలీదుగాని ఇదివరలో ముగ్గురూ ఆడపిల్లలే! నాలుగేళ్ళ మూడేళ్ళ రెండేళ్ళ పసిపాపలు. కమల మాత్రం తన అన్నయ్య కూతురు. తన అన్నయ్య పోతూపోతూ వదినగారినీ, కమలనీ నెత్తిన రుద్ది పొయ్యాడు. కమలానికి పదహారేళ్ళు నిండుతున్నా, వైవాహిక బంధాలకు ప్రయత్నించలేక పోవటం తన ఆర్థిక దుస్థితే కారణమంటాడు వెంకటరత్నం. ఇది కాదనలేము.

నిస్వార్థులైన తన తండ్రులూ, తాతలూ ఉన్నంతవరకూ గడించి, తిని ఇంతపెట్టి పేరు సంపాదించుకుని, జానెడు భూమి కూడా సంపాదించకండా వెళ్ళిపొయ్యారు. లేపటికోసం

వాళ్ళు ప్రయత్నించ లేకపోయ్యారు. ఆఖరికి పిడికెడు గూడు కూడా వాళ్ళ పేర లేదు. రెక్కలొచ్చిన పక్షిగదా అని వెంకటరత్నాన్ని ఏకాకిగానే వదిలేసి వెళ్ళిపోయారు. తన అన్నయ్యమాత్రం ఒక ఇల్లూ కొంత రొక్కం తనకే ఇచ్చిపోయ్యాడు: కూతుర్నీ, భార్యనీ లోకంలో వాళ్ళని చెయ్యమని చెప్పిపోయాడు. వెంకటరత్నానికీవిషయం తన వదినెగారు ఎత్తి పొడిచినపుడు తప్ప మరొక్కప్పుడెప్పుడు జ్ఞాపకం రావలసిన వీలు కనిపించలేదు.

నాలుగో కాన్పయిన వెంకటరత్నం భార్య యమబాధ పడుతోంది. ఒక్క అరగంటలో కల్లా వెంకటరత్నం మంత్రసానిని సాధించుకొచ్చాడు.

ఒక్క గంట! గంటన్నర!

వెంకటరత్నానికి ఆవేదన ఎక్కువయింది. పురుడు సుళువుగా వెడితే తను చాలా అదృష్టవంతుడు! ఇంకా కమలం ఏ వార్తా చెప్పలేదు! తనకు ఆరాటం మాత్రం ఎక్కువయింది.

ఈసారి దేవుడేం చేశాడో? ఆడపిల్లో? మొగపిల్లవాడో? ఇప్పటికే ముగ్గురాడపిల్లల్నిచ్చాడు తన గర్భదారిద్ర్యానికి. ఈ కాన్పు కూడా అదే అయితే తాను సన్యాసం పుచ్చుకోవచ్చు.

తన వెర్రిగాని, తనఇష్టానిష్టాలతో ఇందులో నిమిత్తమే వుంది? అంతా భగవచ్ఛిద్విలాసం! తనవంటివాళ్ళని ఏడిపించటానికి కాకపోతే తనకెందుకుపిల్లలు! ఒక్కరోజన్నా గడవడం కష్టంగావున్న బ్రతుకుకదా! దేవుడినిశ్చితాన్ని తిరగదోయాలని గాఢంగా అభిప్రాయపడ్డాడు వెంకటరత్నం—అటువంటి ఆత్మ బలంకోసం రామనామం జపించాడు.

తనకిది గొప్ప శుభ వర్తమానమేంగాదు—ఒక చేదుమాత్రమింగటంలాంటిదే! తన బ్రతుక్కి మరోటన్ను బరువువేసుకున్నట్టే! తనకునిజంగా దేవుడు మేలుకోరి వరమిస్తే సంతానం అక్కరలేదనే కోరుకుంటాడు.

బాగా తెల్లవారిపోయింది. కమలం ఒక్కగొంతులో ఇవతలికి చౌకళించి, "నాన్నా! ఆడపిల్ల" అని కేక వేసింది.

"నిజమే!" అన్నాడు వెంకటరత్నం.

దిక్కుల కొసల్లోంచి, సముద్రంపొంగి వస్తోన్నట్లనిపించింది తనకి. మావిడికొప్పులో వగరెక్కిన చివుళ్ళు మెక్కిన కోకిల తన్ని శపిస్తోన్నట్టు కనిపించింది

అయితే వెంకటరత్నం జనాభా లెక్కల్లో ఒక్క అంకెను పెంచినపుడు, తన మనస్సు మహారాటంపడింది—దిక్కులెంత ప్రశాంతంగా వున్నా తనకక్కరలేక పోయింది. తనకు రేపు కస్తూరి, కాయం కొనడానికి ఇంటి అవసరాలు తీర్చడానికి దిక్కెక్కణ్ణుంచి వస్తుంది! వెంకటరత్నం గుండెలు టిఫ్వ టిఫ్వమని మోగుతున్నాయి. రేపు అవసరాలకి డబ్బెక్కణ్ణుంచి తెస్తాడు?

అతనికో ఆలోచన తట్టింది. నిజంగా ఆపత్కాలంలో అటువంటి ఆలోచన తోచినందుకు నిలువెత్తునా పొంగి పొయ్యాడు. తనను తానే అభినందించుకున్నాడు. కమలం ముక్కుపుడుకలూ, లోలకులూ అతని ఆలోచనలో మెరుపులు మెరిశాయి. కమలాన్ని పిలిచి అడిగాడు.

"ఇవేకాదు నాన్నా నాకు మిగిలాయి" అంది బిక్కమొగం వేసుకుని- కళ్ళలో కాంతి లేదు, ముఖంలో సుఖంలేదు.

"పుట్టినపిల్ల వూరుకుంటుందటమ్మా! తలైనా తాకట్టు పెట్టాలి"—అంటూ, చిన్న పొట్లం కడుతూ లేచి వెళ్ళిపోయాడు.

* * *

రోజులు గడిచి పోతున్నాయి. వెంకటరత్నానికికూడా అలాగే రోజులు నీరసంగా గడిచి పోతున్నాయి. కమల రూపేణా తన అన్నయ్య తనకి కలిగించిన గాయం అతని మనసులో ఇంకా మానలేదు. అంతకంతకీ ఎక్కువ బాధ కలిగిస్తోంది. వదినెగారు రోజా సాధిస్తోనే వుంది తమ్మన్యాయం చేస్తున్నాడు- రెండువేల రొక్కం చిట్లో కలిపేశాడనీ—తన కూతురికి పెళ్ళిసంబంధాలు చూడనైనా చూడ్డంలేదనీ—తన జీవితం అధోగతి పాలుచేస్తున్నాడనీ.

ఆ రోజు ఆదివారం శెలవునాడు వెంకటరత్నం వదినెగారు ఈ విషయాన్ని రొకాయించింది.

"ఇదిగో! సంబంధాలు చూస్తున్నా" అన్నాడు.

"అదిగాదయ్యా! రెండు వేలు నీ చేతిలో పోసి, పిల్లకి పెళ్ళి చెయ్యమని చెప్పాడుగదా? ఆ డబ్బేగోదారిలో వుందని."

వదినెగారి ఒళ్ళు మండిపోతోంది—ఉన్న డబ్బంతా వ్యాపారంలో తగలపెట్టేశాడు. కులాసాలకూ విలాసాలకూ నాశనం చేశాడు. ఇప్పుడు కాళ్ళు చాచుకూర్చున్నాడు.

వెంకటరత్నం సంబంధాలు చూస్తున్నాడన్నమాట కలలోనైనా నమ్మదగ్గది కాదని వదినెగారికి తెలుసు అముక్కే అంది "నువ్వు ఏం చూడక్కరలేదయ్యా! మేమే చూసుకుంటాం—ఓ పాతిక రూపాయిలిలా పారేయ్" వెంకటరత్నం వెగటుగా నవ్వుతూ, "భలే దానివే! కూతుర్ని పెంచేసుకుని ఊరూరా తిరుగుతావా? నా పిల్లని చేసుకుంటావా? నా పిల్లని చేసుకుంటావా? అని!" కమల కేసి చూస్తూ, "ఏవేఁ మీ అమ్మతో వెడతావా మొగుణ్ణి వెతుక్కోడానికి" అన్నాడు కమల పెదవులు బిగపట్టుకుని గుండెల్లోంచి వస్తోన్న నవ్వును నొక్కి పట్టుకుంది.

"దిక్కు దివాణంలేని ఆడముండల్ని చేసి, మీ అన్నయ్య దోవన ఆయనపోయాడు. ఎన్నటికైనా మేమే తెగించాలి. ఎంతకాదన్నా ఆడ పురుగులం"—అంటూ వదినె కన్నీళ్ళు పెట్టుకుంది.

ఈ మాటలు వెంకటరత్నం గుండెలకి తీవ్రాఘాతం కలిగించాయి. తన పౌరుషాభిమానాలు అతన్ని రెచ్చగొట్టాయి. తన వదినె డబ్బు తను వాడుకున్నాడు ఆడదాని సొమ్ము తిన్నవాడు అతి కష్టుడని లోకం అంటుంది. ఏలాగైతేనేం? కమలం వైవాహికాది నిర్వర్తనలకి తను పూర్ణ బాధ్యతాయుతుడని ప్రపంచం నమ్మింది.

వెంకటరత్నం ఆలోచనల్ని అవతలకి నెట్టేస్తూ, తన పనిలోకి వెళ్ళిపోయాడు. ఇక్కడ ఒక విశేషం చెప్పవలసి వస్తుంది. వెంకటరత్నం తను పనిచేస్తున్న కార్ఖానాలో అందరితో కలిసి ఒక చిన్న సంఘం క్రింద స్థాపించాడు. ఆ సంఘానికి తనే నాయకత్వం వహించి నడుపుతున్నాడు. ఆ సంఘంలో మొత్తం పాతిక ముప్పైమంది దాకా ఉంటారు. అంతా ఆపత్కాలంలో అసరానిమిత్తమన్నట్టు వారానికి రెండో మూడో చందా వేసుకుని వెంకటరత్నం నమ్మకమైనవాడనీ, దుర్వృత్తికాడనీ అతని దగ్గరదాచి పోగుచేసుకున్నారు. అదంతా సంఘంతరఫున బ్యాంకిలో వేసి, తన గౌరవం కాపాడుకొస్తున్నాడు.

ఇలా అయిదారునెలలు బాగా సాగింది. ఏ కార్మికుడికి కష్టం వచ్చినా, నష్టం వచ్చినా జబ్బుచేసినా నిలవ ధనంలోనుంచి వాడుకుని అవసరాలు తీర్చుకున్నారు. నెల రెండువందలు పైగా వెంకటరత్నం చేతిలో పడేవి—కార్ఖానా యజమానికి విషయం చూచాయగా తెలిసింది. వెంకటరత్నం సమ్మెలవీ చేయించాలని చూస్తున్నాడనీ, అందుకే అందరిదగ్గా డబ్బు వసూళ్ళు చేస్తున్నాడనీ, కమ్యూనిస్టు సిద్ధాంతాలు తలకెక్కిన మనిషనీ—ఇంకా ఇంకా ఊదరగొడుతూ వుండేవాడు, ప్రతీ పనివాడితోనూ అంటూండేవాడు. "డబ్బెలాగైనా ఎగనామం పెడతాడు లేరా" అని—అయినా పనివాళ్ళు వెంకటరత్నం మాయమర్మాలు తెలిసిన వాడుగా నమ్మలేక పోయారు.

వెంకటరత్నం వదినెగారు అన్నంత పనీ చేసింది. రెండుమూడు నెలలు చుట్టుప్రక్క గ్రామాలన్నీ చుట్టు బెట్టుకొనివచ్చి, తోచిన సంబంధం నిశ్చయంచేసింది కమలానికి. కట్నం ఇవ్వక్కరలేదు. ఎవరి ఖర్చులు వాళ్ళవి. ఇంకా పైగా కమలానికే నాగరం, చామంతి పువ్వు, చంద్రహారాలు చేయిస్తారు. కమల తల్లి తనింత సాధకురాలైనందుకు మురిసిపోయింది. క్రిందు మీదైనా ఇటువంటి బాంధవ్యం దొరకదని ఎగిరి గంతేసింది. పెళ్ళికొడుకు ఎలాగుంటేనేం? ఆ సంబంధం వెంకటరత్నం పీకలమీదికి తెచ్చి పెట్టింది—ఇకతప్పదనుకున్నాడు. జీవితంలో ఈ మలుపు మళ్ళి పోతే మహాదృష్టవంతుణ్ణనుకున్నాడు—తనేమైనాసరే! ఎవళ్ళ బుర్రయినా బద్దలు కొట్టయినాసరే ఈ పెళ్ళి చేసితీరాలి.

ఆవేళ కొత్త ఉత్సాహంగావుంది! పూరి గుడిసైనా కళకళలాడుతూ వుంది. కమలాన్ని చూచుకోడానికి వస్తాడు పెళ్ళికొడుకు. ఎరువు

తెచ్చినా పరువునష్టం కాకండా కమల జార్జెట్ చీరకట్టింది. ఉబుకుతోన్న యౌవనమాధుర్యాన్ని తొణికించే సన్నని వల తొడిగి, పువ్వులరవికె బిగించింది. సన్నగా దువ్వుకొని వాలుజడ వేసింది. కేశపు చివళ్లు కుచ్చులావదలి, ఆకుపచ్చ రిబ్బనుకట్టి ఒయ్యారంగా జఘన సీమల మీద నాట్యం చేయడానికి వదిలింది.

"ఇన్నాళ్ళనుంచీ అజ్ఞాతంగా వుండిపోయిన అందం ఎంత చిమ్ముతోందో నాతల్లిలోంచి" అనుకుంది కమలం తల్లి. పెళ్లికొడుకు చూసుకున్నాడు. అతనికి నచ్చకపోవడానికి ఆమెలో లోపం ఏమాత్రం కనిపించలేదు. కొందరు తమాషాగా అంటూంటారే-ఆ అమ్మాయి నారింజపండులా ఉందని-బత్తాయి పండులా వుంటుందని-ఆవేం ఉపమానాలోగాని, మనిషిని పళ్ళతోను ఫలాలతోను పోల్చటం ఎంతహీనం!

తాంబూలాలు పుచ్చుకున్నారు. రెండు నెల లయిన తర్వాత ముహూర్తం పెట్టుకున్నారు. కమల పెళ్లికొడుకుని చూడగలిగింది. అతనివి పిల్లికళ్లు. ముక్కు పెద్దదీ దళసరీని. పెదవులు పొగచూరిన గోడల్లా వున్నాయి. లావుగా మోటుగా వున్నాడు. తను ఎత్తిన కళ్ళు ఒక నిమిషంకూడ పరామర్శ చెయ్యలేకపోయ్యాయి. అతనిని చూడటం వెగటనిపించింది. కాని అతనితోనే జీవితభాగాన్ని పంచుకోవాలి. అతనికి బానిసగా మారాలి. తప్పదు. తనలో ఆశలన్నీ అరిపోయ్యాయి. ఏం మొగుళ్ళో? ఏం లోకమో? అనిపించింది కమలానికి.

పెళ్ళిగాడుకు మాత్రం కమలం కమలాఫలంలావుందని అనుకుని వుంటాడు. అందుకోసమే అతను చూపుల కొచ్చినప్పటినుండి చప్పరించడం మొదలు పెట్టాడు.

కమల తన భావిజీవితానికి వెక్కివెక్కి ఏడ్చింది. తన తల్లితో మొరపెట్టుకుంది.

"నీ మొహం! నీకేం తెలుసే! అది చెయ్యిజారిపోతే మనకు నూతిలో నీళ్లు కూడా దొరకవు. ఎంతమంచి సంబంధం! నేను స్వయంగా వెళ్ళి ఏరుకొచ్చిన దానికి వంక పెడతావుటే!" తల్లి నాలుగు చీవాట్లు వేసింది.

వెంకటరత్నం ముభావంగా చూస్తూ వూరుకొన్నాడు. కంటికి కడివెడు నీళ్ళుగా యేడుస్తున్నా కమలాన్ని సముదాయించే వాళ్లే లేకపోయ్యారు. ముహూర్తం దగ్గర పడుతున్న కొద్దీ వెంకటరత్నాన్ని కొన్ని అజ్ఞాతశక్తులు తొందరపెట్టసాగాయి.

అతని మనసులో ఆలోచన మసలింది. కాని వెనక గాఢాంధకారం. భయంకర జాజ్వల్యమాన రేఖా శాఖలు విరుచుకుపడుతున్నాయ్, జైలు కటకటాలు ఫెళఫెళ విరిగిపోతున్నయ్.

ఎక్కణ్ణుంచి తెచ్చాడోగాని ముహూర్తం వెళ్లదీశాడు. కమలానికి కళ్యాణం కాలగర్భంలో కలిసిపోయింది పీడకలవలె. గంపెడు సారెతో కమల భారాన్ని దించేసుకున్నాడు. కాని అతనిలో శాంతికి బదులు అశాంతి రేగింది. శాంతికి బదులు క్రాంతి కలవరపెట్టింది. మళ్లీ తన భార్య త్వరలో కనబోతూ ఉన్నది. ఇది ప్రతి యేటా దేవుడు తనకిచ్చిన ఘోర శాపం.

వెంకటరత్నం కమల పెళ్ళయినదగ్గర్నుంచీ బెంగటిల్లిపోతున్నాడు. అతని బాధేమిటో ఇతరుల కర్థంగాదు.

మళ్ళీ వెంకటరత్నం భార్య ప్రసవించే రోజు దగ్గర పడింది. గాఢాంధకారం! దీర్ఘ రాత్రి! వదినెగారొచ్చి చెప్పింది భార్యకి నొప్పులని— తలమీద గుడ్డేసుకుని మంత్రసాని కోసం బయల్దేరాడు.

తెల్లవారింది. మంత్రసాని కేకవేసింది "మొగపిల్లవా"డని — వెంకటరత్నం గుండె ఒక్కసారి ఆగినట్టయింది.

చేతిలో చిల్లి గవ్వ లేదు. సంఘంవాళ్ల డబ్బు పెళ్ళి కార్యాలకి వినియోగించాడు. బ్యాంకు ఖాతా ఖాళీ. కార్మికులంతా విరుచుకుపడ్డారు. చేతులందించి వూరుకున్నాడు.

పోలీసులు బేడీలు వేశారు. ఊరంతా త్రిప్పి తీసుకెడుతోంటే తలెత్త లేకపోయాడు. జైలు కటకటాలు! జావన్నం! మట్టికేల!

కెవ్వున కేక వినిపించింది. కొడుకు పిలుస్తున్నాడు. అప్పుడే పుట్టిన పసిగుడ్డు! తన భార్య సొమ్మసిల్లి పడివుంది. ముందడుగు పెట్టబోయాడు. ఇనప కటకటాలు!

దీనంతకీ కారణం—అదిగో నవ్వుతోంది కమలం—ఆరు వందలూ పెట్టి పెళ్ళి చేసుకుని మొగుడితో పారిపోయింది!